

పూలబజార్ వద్ద...



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద...

రోడ్లు - ఓట్లు

- కొండెక్కిన రోడ్ల విస్తరణ
- ప్రతిపాదనలకే పరిమితం
- ఎన్నికలు వస్తున్నందుకే నిర్లక్ష్యం
- ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధం కాని ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

కర్నూలు (న్యూసిటీ), జవవరి 17

నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను కార్పొరేషన్ అధికారులు నియంత్రిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పాతబస్తీలో ట్రాఫిక్‌తో వాహనదారులు, పాదచరులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తూనే ఉన్నారు. రోడ్ల విస్తరణలో ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కానీ ఇంత వరకు ప్రభుత్వం ఆచరణలోకి తీసుక రాలేదు. కానీ ఇంతలో ఎన్నికలు వచ్చాయి. రోడ్ల విస్తరణ పేరుతో ఆక్రమిత ప్రాంతాల్లోని ఇండ్లు, దుకాణాలు తొలగిస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందని, ఓటు బ్యాంకు దెబ్బతింటుందని అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు మిన్నకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కర్నూలు నగరంలోని ట్రాఫిక్ సమస్య తెలియాలంటే ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పాత కంట్రోల్ రూమ్ నుండి పెద్ద మార్కెట్, గడియారం ఆసుపత్రి, పూలబజార్, వన్‌టౌన్, జమ్మిచెట్టు మీదుగా జొహరాపురం మార్గంలోకి వెళ్లాలి. ఒకసారి ఈ ప్రాంతానికి వెళ్లాక తిరిగి రావడానికి ఎంత టైం పట్టేదీ చెప్పలేం. ట్రాఫిక్‌ను దాటుకుని గమ్యం చేరాలంటే వాహనదారులు, పాదచారులకు చుక్కలు కనపడతాయి. పూలబజార్, మించిన్‌బజార్, వన్‌టౌన్ ప్రాంతాలలో ఉండే హోల్‌సేల్ దుకాణాలకు వివిధ ప్రాంతాల నుండి నిత్యం వేల మంది వస్తుంటారు. ఈ ప్రాంతం వ్యాపార కూడలి కావడం, ఇక్కడి రోడ్లు చిన్నగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్లు ఎప్పుడు విశాలం చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు.



కింగ్ మార్కెట్ వద్ద రోడ్డుపైనే వ్యాపారాలు

● ప్రతిపాదనలకే పరిమితమైన రోడ్ల విస్తరణ

టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్ల విస్తరణకు గతంలోనే ప్రతిపాదనలు పంపారు. ప్రధానంగా కిడ్స్ వరల్డ్ నుండి ఉస్మానియా కళాశాల మీదుగా జమ్మిచెట్టు, పాతబస్టాండు డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహం నుండి తుంగభద్ర నది తీరాన రాఘవేంద్ర మఠం, మాసుంబాషా దర్గా నుండి పూలబజార్ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు రోడ్ల విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేసారు. టీడీఆర్ ఇవ్వడంతో పాటు తొలగించిన దుకాణాలు, భవనాలకు నష్టపరిహారం చెల్లించేలా ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.

- డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి రాఘవేంద్ర మఠం వరకు ప్రస్తుతం 29 అడుగుల రోడ్డు ఉంది. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 89 భవనాలను తొలగించాలి. అప్పుడు 60 అడుగుల రోడ్డు వస్తుంది.
- కిడ్స్ వరల్డ్ నుండి కల్లూరు దర్వాజ వరకు ప్రస్తుతం 18 నుండి 30 అడుగుల రోడ్డు ఉంది. అయితే రోడ్డు విస్తరణలో 190 భవనాలను తొలగించాలి. దీంతో 50 అడుగుల రోడ్డు వస్తుంది.
- రోడ్డు విస్తరణలో భాగంగా 70 శాతం కూల్చే భవనాలు 18 ఉండగా, 50 శాతం కూల్చే భవనాలు 30 ఉన్నాయి. వీటికి సంబంధించిన సర్వే పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం రెండు రోడ్ల పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.
- మాసుం బాషా దర్గా నుండి పొట్టి శ్రీరాములు కూడలి వరకు ఇంకా సర్వే పూర్తి కాలేదు.
- రోడ్ల విస్తరణకు సంబంధించి నివేదికలు పంపాలని ఈ సంవత్సరం ఫిబవరి 7న సీఎంఓ కార్యాలయంల నుంచి కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో రోడ్ల విస్తరణకు రూ.16.23 కోట్లు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అధ్వర్యంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కలెక్టరేట్ నుంచి వయా కల్లూరు దర్వాజా బుధవారపేట, పాతబస్టాండు డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహం నుండి తుంగభద్ర నది తీరాన రాఘవేంద్ర మఠం, ఉస్మానియా కళాశాల నుంచి పూలబజారు ప్రధాన కూడలి వరకు సుమారు రూ.16.23 కోట్లు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే ప్రభుత్వానికి నివేదించారు. నివేదికలు పంపించి 11 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. నగరంలో ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు విస్తరణ జరగదనే విషయం స్పష్టంగా అర్థమమవుతోంది.

● ఓట్ల కోసం...కూల్చడం లేదు..

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు ఓట్ల కోసమే దుకాణాలు, భవనాలను తొలగించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రోడ్ల విస్తరణ అంతా కర్నూలు నియోజకవర్గ పరిదిలోనే జరగాలి. ఈ క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్ల విస్తరణకు అడ్డు కుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా కూడ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకుండా ఆపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓట్ల కోసమే ప్రజలకు నరకం చూపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

● ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి

నగర పాలక సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుండి అనుమతి కోసం వేచియున్నాం. రోడ్ల విస్తరణలో భాగంగా భవనాలు, దుకాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించేలా ప్రణాళికలను సిద్ధం చేశాం. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రోడ్లు విస్తరించాలని గతంలోనే కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు.

- మోహన్‌కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్

రోడ్ల విస్తరణ జరిగితే ఇబ్బందులు తగ్గుతాయి



పరమేష్, 8వ వార్డు కార్పొరేటర్

నగరంలో రోడ్ల విస్తరణ జరిగితే అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయి. ప్రస్తుతం పట్టణం ఇరుకు ఇరుకుగా ఉంది. హఫీజ్‌ఖాన్ ఎమ్మెల్యే అయినప్పటి నుంచి రోడ్ల విస్తరణ చేస్తామని చెబుతున్నారు. అయితే అది అమలుకు నోచుకోవడం లేదు. కేవలం ఓటు బ్యాంకు కోసమే భవనాలు, దుకాణాలను కూల్చేందుకు ప్రజాప్రతినిధులు వెనకాడుతున్నారు.

● నరకం చూస్తున్నాము...



ఈ రోడ్లపై తిరగాలంటే నరకం కనిపిస్తోంది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు ప్రజలను పట్టించుకోవడం లేదు. కిడ్స్ వరల్డ్ నుంచి దండగేరికి పోవాలంటే కనీసం అర్ధగంట పడుతున్నది. ముఖ్యంగా కేవీఆర్ గార్డెన్ వద్ద రోడ్డు చిన్నగా ఉండటంతో అటువైపు నుంచి..ఇటు వైపు నుంచి ఒకే సారి వాహనాలు వచ్చినప్పుడు నడుచుకుంటూ పోయేవాళ్ళ ఇబ్బంది పడుతున్నా రు.

- శ్రీదేవి, స్థానికురాలు



వడ్డెగేరిలో ఇలా...

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

- నేటితో ముగియనున్న సంక్రాంతి ఉత్సవాలు



పుష్కరిణిలో చండీశ్వర స్వామికి త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైలం మహా క్షేత్రంలో ఏడు రోజుల పాటు జరిగే మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యాగ పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. అర్చకులు, వేదపండితులు వసంతోత్సవం నిర్వహించారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణ కార్యక్రమాన్ని జరిపారు. వేద శ్రవణం కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది వేదపండితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సంక్రాంతి ఉత్సవాలు

మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ ఆలయ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహిస్తారు.



హోమగుండంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్లకు పూజలు

సంక్రాంతి సెలవులు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 17: సంక్రాంతి సెలవులను మరో మూడు రోజులు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి బుధవారం తెలిపారు. సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 22 నుంచి పునఃప్రారంభమవుతాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉంది. పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సెలవులను పొడిగించినట్లు డీఈఓ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం : కలెక్టర్



కర్నూలు (కలెక్టరేట్), జనవరి 17: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 27వ తేదీలోపు మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ జి.సృజన వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్లలో ర్యాంప్, వాటర్, పవర్ సాకెట్, ట్యూబ్‌లైట్లు, విద్యుత్ సరఫరా తదితర మరమ్మత్తులను చేపడుతున్నట్లు తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, షెడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఓటు నమోదుకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులన్నీ క్లియర్ చేశామన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ గదులు, డిస్పాచ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్ రావు, మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎండు మిరప ధర పతనం

- క్వింటం బ్యాడిగి రకం రూ.20 వేలు
- వ్యవసాయ ఖర్చులు రాని వైనం
- ఆందోళనలో రైతులు

ఆదోని (అగ్రికల్చర్) జనవరి 17: ఎండుమిరప ధరలు పతనమయ్యాయి. గత వారంతో పోల్చితే ధరలు మరింత దిగజారడంతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఎండుమిరప బ్యాడిగి రకం క్వింటం గరిష్టంగా రూ.20 వేలు పలికింది. సంక్రాంతి మునుపు ధర కంటే క్వింటాకు రూ.2 వేలు తగ్గింది. కడ్డీ బ్యాడిగి, తేజ, సీంజెంటా, డీడీ రకం ఎండుమిరప ధరలు కూడా మరింత తగ్గడంతో రైతులు కుమిలిపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని అప్పులు పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండుమిరప ఎగుమతి లేకపోవడంతోనే ధరల పతనానికి కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. బ్యాడిగి రకం మిరప క్వింటం కనిష్ట ధర రూ.5 వేలు, గరిష్ట ధర రూ.20 వేలు, సింజెంటా క్వింటం కనిష్టం రూ.4,500, గరిష్టం రూ.13,011, తేజాతాలు కనిష్టం రూ.3,900, గరిష్టం రూ.16,100, డీడీ క్వింటాలు కనిష్టం రూ.4,109, గరిష్టం రూ.12,700, కడ్డీ బ్యాడిగి రకం కనిష్టంగా రూ.4,100, గరిష్టంగా రూ.12,697 పలికింది.



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకి విక్రయానికి వచ్చిన ఎండు మిరప

రెండూళ్లు ఖాళీ

- వలస వెళ్లిన దుద్ది, కోల్‌మాన్‌పేట
- ఒకే రోజు 700 కుటుంబాలు గుంటూరుకు పయనం
- ఉపాధి హామీ లేక వలస బాట
- కోసిగి మండలంలో పెరిగిన వలసలు



గుంటూరుకు వలస వెళ్తున్న కోల్‌మాన్‌పేట ప్రజలు



బొలెరో వాహనంలో గుంటూరుకు వలస వెళ్తున్న దుద్ది గ్రామస్తులు

కోసిగి, జనవరి 17: పల్లె తరలిపోతోంది. పొట్టచేతపట్టుకొని ఎక్కడ పని దొరికితే అక్కడికి వ్యవసాయ కూలీలు వలస వెళుతున్నారు. ఊళ్లలో చేద్దామంటే పనులు లేవు. ఖాళీగా ఉంటే అప్పు చేసి కడుపు నింపుకోవాలి. అందుకని మూటాముల్లే సర్దుకుని పిల్లాపాపలతో కలిసి ఇంటికి తాళాలు వేసి పల్లె ప్రజలు పట్టణానికి వలసబాట పట్టారు. మండలంలోని దుద్ది, కోల్‌మాన్‌పేట గ్రామాల్లో సుమారు 700 కుటుంబాలు 15 వాహనాలలో పిల్లాపాపలతో కలిసి గుంటూరుకు వలసబాట పట్టారు. ఒకే రోజు 20 వాహనాల్లో రెండు గ్రామాల ప్రజలు వలసబాట పట్టడంతో గ్రామాలు మొత్తం బోసిపోయాయి. ఉపాధి హామీ పథకం గ్రామ ప్రజలకు పని చూపకపోవడంతో గ్రామాల్లో పనులు లేక పట్టణానికి వలస వెళ్తున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ గ్రామం మొత్తం ఖాళీయ్యేలా వలస వెళ్లలేదని, ఈ ఏడాది వర్షాలు లేక, చేయడానికి పనులు లేక అందరం వలస వెళ్తున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెక్ పవర్ లేని చైర్మన్లు



- అధికారులు తయారు చేసే నోట్ ఫైళ్లపై సంతకాలకే పరిమితం
- గౌరవ వేతనం రూ.500 నుంచి రూ.1000
- ఖాళీగా పాణ్యం, కోడుమూరు చైర్మన్ పోస్టులు

వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ యార్డులు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని, వాటి వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని రైతులు అంటున్నారు. జగన్ ప్రభుత్వం తమకు చెక్ పవర్ కట్ చేసిందని, దీని వల్ల తాము రైతులకు ఏమీ చేయలేకపోతున్నామని మార్కెట్‌యార్డు పాలక మండలి సభ్యులు, చైర్మన్లు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలకు ఐదేళ్లు పూర్తవుతున్నా ప్రభుత్వం పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. జగన్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలను దెబ్బతీయడానికే ఈ విధానం అనుసరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల కొన్ని మార్కెట్ కమిటీల్లో అధికారులు తయారు చేసిన నోట్ ఫైల్ మీద సంతకాలు పెట్టడంతో చైర్మన్ల పాత్ర ముగిసిపోతున్నది. కళ్లముందు అక్రమాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు వెళ్లాల్సి వస్తోందని, కమిటీలో తమ మాటకు విలువ లేకుండా పోయిందని కొంత మంది చైర్మన్లు సన్నిహితుల దగ్గర వాపోతున్నారు. కొన్ని మార్కెట్ కమిటీ యార్డుల్లో సెస్సు ఆదాయాన్ని పెంచేందుకు వినియోగించాల్సిన వాహన సౌకర్యం దుర్వినియోగం అవుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 17: ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసీపీ ప్రభుత్వానికి ముందు 12 మార్కెట్ కమిటీలు పని చేస్తూ ఉండేవి. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తానని చెప్పి 12 మార్కెట్ కమిటీలను 15 మార్కెట్ కమిటీలుగా విస్తరించారు. కర్నూలు, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలతో పాటు మంత్రాలయం, కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిల్లో కర్నూలు, ఆదోని, నంద్యాల సెలక్షన్ గ్రేడ్ కమిటీలు కాగా, ఎమ్మిగనూరు స్పెషల్ గ్రేడ్ కమిటీగా, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కోవెలకుంట్ల గ్రేడ్-1 కమిటీలుగా, ఆలూరు, ఆత్మకూరు, డోన్ మార్కెట్ కమిటీలను గ్రేడ్-2 కమిటీలుగా మార్చారు. కొత్త కమిటీల ఏర్పాటు, కొన్నిటి స్థాయి పెంచడం తప్ప తమకు ఉపయోగపడేలా ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చైర్మన్లు ఉత్సవ విగ్రహాలే:

అధినాయకులను కాళ్లావేళ్లా పడి ఉన్న డబ్బంతా ఊడ్చిపెట్టి పదవి చేపట్టిన తమకు ఎలాంటి అధికారం లేదని, ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్లు నిరుత్సాహానికి గురవుతున్నారు. అధికారులు తయారు చేసిన నోట్‌ఫైల్‌పై సంతకాలకే తాము పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్ ఉండేది. దీని వల్ల అధికారులు, సిబ్బంది కొంత వరకు చైర్మన్ మాటకు కట్టుబడి ఉండేవారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకటి, రెండు మార్కెట్ కమిటీల్లోని చైర్మన్లకు తప్పితే.. మిగిలిన మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఏ ప్రాధాన్యత లేకుండా పోయింది.

● గౌరవ వేతనం రూ.500 నుంచి రూ.1000:

మార్కెట్ కమిటీలలో చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్లు ఉంటారు. చైర్మన్లకే విలువ లేని పరిస్థితుల్లో డైరెక్టర్ల పదవికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండాపోయింది. చైర్మన్లకు మార్కెట్ కమిటీల స్థాయిని బట్టి నెలకు రూ.500 నుంచి రూ.1000 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తారు. ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు సెస్సు ఆదాయాన్ని పెంచుకునేందుకు, గ్రామాల్లో పర్యటించేందుకు మార్కెట్ కమిటీల స్థాయిని బట్టి వాహన సౌకర్యాన్ని కల్పించింది. కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీలకు ఏడాది పొడవునా వాహనాన్ని ఏర్పాటు చేయగా.. ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలకు కేవలం 3 నెలల పాటు వాహన సౌకర్యాన్ని కల్పించారు. మార్కెట్ కమిటీలల్లో చాలా వరకు ఈ వాహనాలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

● ఐదేళ్లు గడిచిపోతున్నా.. చైర్మన్ పోస్టులు ఖాళీనే:

చైర్మన్ పదవుల కోసం తమ అనుచరులు క్యూ కడుతుండటంతో ఎవరికి ఇవ్వాల్లో అర్థం కాక ఆయా మార్కెట్ కమిటీల పరిధిలోని ఎమ్మెల్యేలు ఐదేళ్లుగా ఆ పోస్టులను ఖాళీ పెట్టేశారు. కోడుమూరు నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మను పోస్టును తాము సూచించిన వ్యక్తికే కట్టబెట్టాలని అధికార పార్టీలోనే ఎమ్మెల్యే సుధాకర్‌తో పాటు కుడా చైర్మన్‌గా కోట్ల హర్షవర్దన్ రెడ్డి పట్టుబడుతున్నారు. దీంతో ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టును ఖాళీగా ఉండిపోయింది. పాణ్యం మార్కెట్ కమిటీకీ చైర్మన్ పదవి పరిస్థితి కూడా ఇంతే. దీన్ని ఇప్పటిదాకా భర్తీ చేయలేదు.

● చైర్మన్లకు చెక్‌పవర్ లేదు



మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. అధికారులు తయారు చేసే నోట్‌ఫైల్‌పై సంతకాన్ని పెట్టే అధికారంతో పాటు మార్కెట్ కమిటీలో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించే అధికారం చైర్మన్లకు ఉంది. కోడుమూరు మార్కెట్ కమిటీకి చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమించేందుకు ఎమ్మెల్యేలకు లెటరు పంపాం. వారి నుంచి ప్రతిపాదన రాకపోవడంతో నియామకం పెండింగ్‌లో ఉంది.

- నారాయణమూర్తి, ఏడీఎం

ఆధారాలు చూపలేదు.. చార్జిషీట్ వేయలేదు

- సుప్రీంకోర్టు తీర్పుపై సీఐడీ తీరు ఆక్షేపణీయం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 17: చంద్రబాబు కేసులో సుప్రీం కోర్టు తీర్పుపై సీఐడీ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈకేసులో చంద్రబాబుకు డబ్బు చేరిందనిగాని, కనీసం నిధులు దుర్వినియోగం అయ్యాయనిగాని సీఐడీ ఆధారాలు చూపించలేదని అన్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఏ కేసులో కూడా చంద్రబాబుకు గానీ, ఆయన పార్టీ సభ్యులకు గాని ఒక్క రూపాయి చేరినట్లు ఆధారాలు చూపించ లేదని అన్నారు. పార్టీకి వచ్చిన సభ్యత్వ రుసుములను అక్రమ నిధులుగా చూపించాలనే ప్రయత్నాన్ని తెలుగుదేశం సాక్ష్యాధారాలతో తిప్పికొట్టిందని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క కేసులో చార్జిషీటు దాఖలు చేసే సత్తా ఈ ప్రభుత్వానికి గాని, తాబేదారు అయిన సీఐడీ సంస్థకు గాని లేదన్నారు. కక్ష పూరిత ధోరణికి ఇంత కంటే నిదర్శనం మరోటి లేదని మండిపడ్డారు.

ఆర్‌యూ వీసీగా ప్రేమ్ కుమార్



కర్నూలు(అర్బన్), జనవరి 17: రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్‌ను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సుధీర్ ప్రేమ్ కుమార్‌ను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా నియమించారు. నవంబరు 17వ తేదీనే ఆయన పేరు ఖరారు అయినట్లు ఆంధ్రజ్యోతి ముందుగానే చెప్పింది. ముగ్గురు ప్రొఫెసర్లు ప్రయత్నించగా ప్రేమ్‌కుమార్ పేరు ఖరారైంది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా 2019 నుంచి 2022 వరకు పని చేశారు. ఆ తర్వాత యాప్సిలో సెక్రటరీగా పనిచేస్తూ తర్వాత తిరిగి మాతృసంస్థ జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌గా చేరారు. ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీకి ఇన్‌చార్జ్ వీసీగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.ఫజులూర్ రెహమాన్ కొనసాగుతున్నారు. నవంబరు 24తో గతంలో పని చేసిన ఆకెపోగు ఆనందరావు పదవీ కాలం ముగియడంతో వీసీ పోస్టు కోసం దాదాపు 156 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏపీ విశ్వవిద్యాలయాల చట్టం-1991 ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను గవర్నర్ నియమించారు.

కోటి సంతకాల నిరసన



మొదటి సంతకం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 17: అంగన్‌వాడీల సమ్మె 37వ రోజుకు చేరింది. సమ్మెను ఉధృతం చేయడంలో భాగంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి అంగన్‌వాడీలు కోటి సంతకాల సేకరణ అనే వినూత్న కార్యక్రమం చేపట్టారు. బుధవారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీల శిబిరాన్ని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ సందర్శించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మొదటి సంతకం చేసి సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల కోర్కెలు న్యాయమైనవని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాయంత్రం అంగన్‌వాడీలు కర్నూలు ప్రాజెక్టుకు సంబంధించిన టీచర్లు ఆయాల నివాసాల గోడలకు అంటించిన నోటీసులకు బదులిస్తూ సంజాయిషీ పత్రాలను కర్నూలు అర్బన్ సీడీపీవోకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎస్.మునెప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంజాయిషీ పత్రాలకు ప్రభుత్వానికి బదులిచ్చామని అన్నారు. అనంతరం దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డ్యూటీలకు ఎవరు హాజరు కావద్దని ప్రతిజ్ఞ చేశారు.

నకిలీ ఔషధ తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ సంజీవ్‌కుమార్



కర్నూలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నకిలీ ఔషధాలు తయారు చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా మహారాష్ట్రలోని ముంబాయి నగరంలో పలు సంస్థలతో సమావేశం అయ్యారు. ఈ కమిటీ చైర్మన్ శశిధరూర్ హాజరు కాకపోవడంతో ఎంపీ సంజీవ్‌కుమార్ పర్యవేక్షణలోనే సమావేశాలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఫార్మాస్యూటికల్స్, జాతీయ ఫార్మస్యూటికల్స్ ప్రైసింజ్ అథారిటీ, మహారాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటకల్స్ వంటి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఇందులో డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్య, వైద్యం, న్యాయం మూడు ప్రాథమిక బాధ్యతలు ఉంటాయని అన్నారు. నాణ్యమైన మందులు అందుబాటులోకి తీసుకురావాలని, 75 శాతం రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వాలకు ఆయన సూచించారు.

ఆదోనిలో అదృశ్యమయ్యాడు...

సాదాపురంలో శవమయ్యాడు

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

ఆదోని రూరల్, జనవరి 17 : ఆదోనిలో ఆరు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి సాదాపురంలో శవమై కనిపించాడు. ఆదోని పట్టణంలోని లక్ష్మమ్మవ్వ నగర్‌కు చెందిన గంగాధర్‌కు(33) 10 సంవత్సరాల క్రితం మండలంలోని దిబ్బనకల్లు గ్రామానికి చెందిన ఎస్తేరమ్మతో వివాహమైంది. అయితే మూడు సంవత్సరాల క్రితం భార్య ఎస్తేరమ్మ అతనిని వదిలి వెళ్లిపోయింది. కొన్ని సంవత్సరాలుగా గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపంతో ఉన్న గంగాధర్ గత శనివారం సాదాపురంలోని ఓ పొలంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం స్థానికులు ఆ చెరువులో శవాన్ని గుర్తించి రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి, ఎస్ఐ ఎర్రిస్వామిలకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని వెలికి తీసి మార్చురీకి తరలిస్తుండగా గంగాధర్ బంధువులు అక్కడికి చేరుకొని మృతదేహంపై ఏసుక్రీస్తు పచ్చబొట్టు, ఓంలను చూసి గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

ఎస్ఎస్‌ఏ ఏపీసీగా విజయజ్యోతి కుమారి



బాధ్యతలు స్వీకరించిన విజయజ్యోతి కుమారి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 17: జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా విజయజ్యోతి కుమారి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 27వ తేదీన డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఎస్ఏ పీవోగా పని చేస్తున్న వేణుగోపాల్ మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం విజయజ్యోతి కుమారి మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వివరించారు. అనంతరం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు.

వెంకయ్యనగర్‌లో చోరీ

కర్నూలు, జనవరి 17: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకయ్య నగర్‌లో చోరీ జరిగింది. రాజశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీకి గురైంది. రాజశేఖర్ రెడ్డి మెడికల్ రెప్‌గా పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గూడూరు మండలం యనగండ్ల వెళ్లారు. తిరిగి బుధవారం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28 వరకు కుల గణన సర్వే నిర్వహించండి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 17: జిల్లాలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కుల గణన సర్వే నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కుల గణన సర్వేపై కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులగణనపై గత నవంబరు, డిసెంబరులో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పాత యాప్ కాకుండా కొత్త వెర్షన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని వలంటీర్లు సర్వే నిర్వహించాలని అన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

- సైకో పాలనలో బడుగులపై దాడులు, కేసులు
- బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం
- 'జయహో బీసీ' సభలో టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

గడివేముల, జనవరి 17: బీసీల అభివృద్ధి, అభ్యున్నతి టీడీపీ తోనే సాధ్యమని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడివేముల మండల కేంద్రంలో టీడీపీ నాయకులు 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాండ్ర శివానందరెడ్డితో పాటు పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిందన్నారు. గౌరు చరిత మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. అనేక పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధి చేశారన్నారు. పాణ్యం నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చారని అన్నారు. టీడీపీ బీసీలకు వెన్ను దన్నుగా నిలిచిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. పాణ్యం నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ బీసీ నాయకుడి ఆవేదన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌లను 34 నుంచి 24 శాతానికి తగ్గించి బీసీలకు రాజ్యాంగ పదవులను దూరం చేశారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి గాలికొదిలేసి తన అభివృద్ధి చూసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇసుక దొరకని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు ఇస్తామని అన్నారు. వెలగమాను డ్యామ్ పూర్తి చేస్తామన్నారు. గడివేములలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, యాదవ, వాల్మీకి, బెస్త, ఈడిగ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్లు నాగేశ్వరయాదవ్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌గౌడ్, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌గౌడ్, పాణ్యం బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, గిరిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు సత్యంరెడ్డి, నాయకులు సీతారామిరెడ్డి, రఫిక్, రామచంద్రారెడ్డి, శ్రీనివాసయాదవ్, ఖాలిద్‌బాష, మురళీమోహన్‌రెడ్డి, గణేష్ రెడ్డి, సుభద్రమ్మ, లక్ష్మీదేవి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంది బహుమతులు రావడం అభినందనీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కళాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్) జనవరి 17: రంగస్థల కళాకారులు ప్రతిష్ఠాత్మకంగా భావించే నంది నాటకోత్సవాల్లో కర్నూలు కళాకారులు బహుమతులు సాధించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇటీవల కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ఆనంద నిలయం' నాటకానికి రెండు నంది బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా బుధవారం మౌర్య ఇన్‌లోని టీజీ వెంకటేశ్ కార్యాలయంలో తనను కలిసిన కళాకారులను ఆయన అభినందించారు. నాటకంలో తొండమాన్ చక్రవర్తిగా నటించి ఉత్తమ సహాయ నటుడు కేటగిరిలో నంది బహుమతి గెలుచుకున్న పి.భాస్కర్‌ను, నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ జిల్లా నాటక రంగ కీర్తిని చాటి చెప్పాలని టీజీ వెంకటేశ్ కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాటకంలో పాత్రలు పోషించిన కళాకారులందరినీ ఆయన శాలువలతో సత్కరించారు.

ఆరేళ్ల చిన్నారికి కరోనా

కర్నూలు(హాస్పిటల్), జనవరి 17: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 45 మందికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా ఇందులో పీడియాట్రిక్ వార్డులో ఓ బాలికకు, ఏఎంసీలో ఓ వ్యక్తికి కరోనా సోకింది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని వన్‌టౌన్‌లో ఆరేళ్ల బాలిక, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా ఐజలో 50 ఏళ్ల ఉన్న ఓ వ్యక్తికి పాజిటివ్‌గా వచ్చింది. ఇప్పటి వరకు జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 25కు చేరాయి.

శ్రీశైల క్షేత్ర సుందరీకరణకు చర్యలు



మొక్కలు నాటి నీరుపోస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలునాటే కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం క్షేత్రపరిధిలోని పలు చోట్ల మొక్కలు నాటారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని వివిధ ప్రదేశాలలో వివిధ ఆకృతులతో కూడిన మొక్కలను ఏర్పాటు చేశారు. ఇందులో శివలింగం, ఓం, ఏనుగు తదితర ఆలకారాలలో ఏర్పాటు చేసిన మొక్కలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, జనవరి 17: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కండేరీకి చెందిన తెలుగు శేఖర్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెం దాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల వినూత్న నిరసన



గడ్డితింటూ నిరసన తెలుపుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 17: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె బుధవారానికి 32వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట గడ్డి తింటూ విన్నూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.కుమార్, రఘుశేఖర్, నరేష్, నవీన్, బాబ్జి, పరమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్ కోసం వెంకన్నకు తలనీలాలు

కర్నూలు(అర్బన్), జనవరి 17: అక్రమ కేసుల నుంచి చంద్రబాబు, లోకేష్ లకు ఇబ్బందులు తొలగిపోవాలని నగరానికి చెందిన 38,39,40 క్లస్టర్ ఇన్‌చార్జి వై.రామేశ్వరరెడ్డి తలనీలాలు సమర్పించారు. మంగళవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కును తీర్చుకున్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. గత ఏడాది చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు సురక్షితంగా బయ టకు రావాలని, నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని వేంకటేశ్వర స్వామిని మొక్కుకున్నట్లు తెలిపారు.

కష్టపడి పనిచేసే వారికే టికెట్ ఇవ్వాలి

గూడూరు, జనవరి 17: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే టికెట్ ఇవ్వాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు పార్టీ అధిష్ఠానానికి సూచించారు. బుధవారం గూడూరులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గజేంద్ర గోపాల్ నాయుడు మాట్లాడుతూ కోడుమూరు టీడీపీ అభ్యర్థిగా నియోజకవర్గంలో గ్రామగ్రామాన పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన వ్యక్తిని ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో బూత్ ఇన్‌చార్జిలు సుమన్‌బాబు, శాంతరాజు, గిడ్డయ్య, సులేమాన్, నాగరత్నారావు, చిలక శ్రీను, కళ్యాణ్ రఘు పాల్గొన్నారు.

22 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 17: పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపురంలో ఈనెల 22, 23 తేదీల్లో 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 2004 నుంచి 2007 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన జట్టు మహారాష్ట్రలోని సోలాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా వాతావరణ కేంద్రం వ్యవస్థాపక దినం



కేక్ కట్ చేస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 17: భారత వాతావరణ శాఖ కేంద్రం ఏర్పాటై 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ మేరకు కర్నూలు వాతావరణ కేంద్రంలో వ్యవస్థాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓర్వకల్లు విమానాశ్ర యంలో సంబరాలు చేసుకున్నారు. పలువురు వాతావరణ కేంద్రాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించారు. వాతావరణ పరికరాలు, వాటి పనితీరు, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వాతావరణ శాఖ సహాయ అధికారులు పీయూష్‌వర్మ, రాహుల్ పాల్గొని మాట్లాడుతూ 1875 సంవతంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. వాతావరణ విషయాలను రైతులకు, ప్రజలకు సకాలంలో అంది స్తున్నామన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో జరిగిన వేడుకలకు విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై వాతావరణ శాఖ ప్రాముఖ్యత, అందించే సేవల గురించి వివరించారు. ఈసందర్భంగా విశ్రాంత ఉద్యోగి నాగన్నను సన్మానించారు. కార్యక్రమంలో సహాయ అధికారులు అమృత్, నాగలింగమయ్య, అవినాష్ పాల్గొన్నారు.

రైతులకు ఉల్లి రాయితీ ఇంకెప్పుడు ఇస్తారు?

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 17: ఉల్లి రాయితీని రైతులకు ఇంకెప్పుడు ఇస్తారని కర్నూలు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఆగస్టు నుంచి అదే సంవత్సరం ఫిబ్రవరి నెలా ఖరు వరకు యార్డులో ఉల్లిని విక్రయించిన రైతులకు క్వింటం ఉల్లికి రూ.700 మద్దతు ధరను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని అన్నారు. వ్యాపారులు అందించిన ధరను పరిగణనలోకి తీసుకుని మిగిలిన డబ్బును రాయితీ రూపంలో ప్రభుత్వం అందించేందుకు నిర్ణయం తీసుకుందని, జిల్లాలో 9,740 మంది రైతులు 3,47,911 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించారన్నారు. వీరికి రూ.6.45 కోట్లు రాయితీగా అందించాల్సి ఉందని, అయితే ఎన్నికలు పూర్తయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు రైతులకు పెండింగ్‌లో ఉన్న రాయితీ సొమ్మును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఒప్పించి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తా మని హామీ ఇచ్చారని, ఇప్పటి దాకా ఒక్క రూపాయి కూడా రైతులకు అందిం చకపోవడం దారుణమన్నారు.

గూడూరు పోలీసు స్టేషన్ తనిఖీ

గూడూరు, జనవరి 17: గూడూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో శాంతి భద్రతలపై దృష్టి సారించా లని ఆదేశించారు. ఎవ్వరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్కా బీటర్ల అరెస్టు

కర్నూలు, జనవరి 17: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇందిరాగాంధీ నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మన్యం, యాకోబు అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.22వేల నగదు, మట్కా చీటీలతో పాటు 20 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నింది తులను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

నదులను అనుసంధానం చేయాలి

కర్నూలు(రూరల్), జనవరి 17: దక్షిణ భారతదేశంలో నదులను అనుసంధానం చేయాలని ద్రావిడనాడు సంక్షేమ సంఘం నాయకుడు డాక్టర్ కె.సోమన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ద్రావిడ భాషల ప్రజల, సంస్కృతి ప్రాంతీయ అభివృద్ధి అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసమావేశం రామచంద్రన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ సోమన్న మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రెండో రాజధానితోపాటు సుప్రీంకోర్టు బెంచ్‌ను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనతావికాస్ వ్యవస్థాపకుడు రవిగువేరా, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు అజయ్‌కుమార్, ప్రొఫెసర్ పుణ్యశేషులు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాజన్న బంగి శ్రీనివాసులు, అడ్వకేట్ దానంరాజు, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా టీజీవీ ట్రేడ్ యూనియన్



టీజీ భరత్‌ను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 17: కార్మికులకు టీజీవీ ట్రేడ్ యూనియన్ అండగా నిలిచిందని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలో సీక్యాంప్ టీజీ లక్ష్మీ వెంకటేష్ కమ్యూనిటీ హాలులో టీజీవీ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి అన్యాయం జరిగితే టీజీవీ ట్రేడ్ యూనియన్ ఒక చెక్ పోస్టులా ఉంటుందని, ఇతర యూని యన్లు సైతం జాగ్రత్తగా ఉండే పరిస్థితి తీసుకొచ్చామన్నారు. ఈ సమావేశంలో టీజీవీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బాలయ్య, గౌరవ అధ్యక్షుడు శేషగిరి శెట్టి, చిన్న వ్యాపారుల సంఘం నగర అధ్యక్షుడు జూటూరు రవి, అనుబంధ సంఘాల నాయకులు నరసింహులు, రాఘవేంద్ర, సుదర్శన్ పాల్గొన్నారు.

నగరమా మేలుకోతో ప్రజల్లో చైతన్యం తెచ్చాం: నగరమా మేలుకో కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 52వ వార్డులో చివరి రోజు నగరమా.. మేలు కో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వార్డుల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల తదితర సమస్యలను ప్రజలు విన్నవిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి హర్షద్, టీడీపీ సీనియర్ నాయకులు బొల్లెద్దుల రామకృష్ణ, అబ్బాస్, మన్సూర్ అలీఖాన్, రామాంజనేయులు, ఆర్యశంకర్, నాగన్న, మారుతి శర్మ, సౌభాగ్యమ్మ, రేష్మాభాయ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జంబో ప్లాట్‌ఫారానికి మోక్షమెప్పుడో?



పిల్లర్లకే పరిమితమైన జంబో ప్లాట్‌ఫారం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 17: రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను కర్నూలు మార్కెట్ యార్డుకు విక్రయానికి తీసుకువస్తున్నారు. దీంతో రద్దీ ఎక్కువ కావడంతో రూ.6 కోట్లతో జంబో ప్లాట్‌ఫారాన్ని కర్నూలు మార్కెట్ కమిటీ చేపట్టింది. అయితే నిధుల సమస్య, ఇతరత్రా కారణాల వల్ల జంబో ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తి చేసేందుకు అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం జంబో ప్లాట్‌ఫారం పిల్లర్లకే పరిమితమైంది. రేకులతో పైకప్పు ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ నిలిచి పోయింది. ఎన్నికలు సమీపిస్తుండటం వల్ల ఈ ప్లాట్‌ఫారం నిర్మాణం చేప డితే.. తమకు సకాలంలో బిల్లులు అందుతాయో లేదోనని కాంట్రాక్టరు ఆందో ళన చెందుతున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. మూడుసార్లు పైకప్పు ఏర్పా టు కోసం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కనీసం వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా జంబో ప్లాట్‌ఫారాన్ని తమకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు మాట్లాడుతూ టెండరు ప్రక్రియ పూర్తయిందని, అగ్రి మెంటు కాగానే కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టే అవకాశం ఉందన్నారు.

ఆలస్యమవుతున్న ఎంఆర్ఐ రిపోర్టులు

» సూపరింటెండెంట్‌కు హెచ్‌ఓడీల ఫిర్యాదు
» ఇక నుంచి రెగ్యులర్‌గా 'సూపర్ స్పెషాలిటీ' ఓపీలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జనవరి 17: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంఆర్ఐ ఆన్‌లైన్ రిపోర్టులు తరచూ ఆలస్యమవుతున్నాయని, దీంతో రోగుల చికిత్స, ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ హెచ్‌ఓడీలు ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై హెచ్‌ఓడీలతో సూపరింటెండెంట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఎంఆర్ఐ రిపోర్టులు, రోజులతరబడి రావడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కొందరు హెచ్‌ఓడీలు సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన రేడియాలజి హెచ్‌ఓడీని వివరణ కోరారు. ఎంఆర్ఐ రిపోర్టుల కోసం రోగులు ఇబ్బందులు పడకుండా పరీక్షలు చేసిన ఆరు గంటల్లోపు రిపోర్టులు ఇవ్వాలని ఎంఆర్ఐ నిర్వాహకులను ఆదేశించారు. రేడియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొందరిని నియమించి ఎంఆర్ఐ రిపోర్టులు ఏరోజుకారోజు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రేడియాలజి హెచ్‌ఓడీని ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఓపీలను ప్రతిరోజు రెగ్యులర్‌గా నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఈ హాస్పిటల్ టార్గెట్లలో టాప్ పర్ఫార్మెన్స్ కనబరిచిన పీడీయాట్రిక్, సైక్రియాట్రిక్ డిపార్టుమెంట్లను సూపరింటెండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

రేపు యోగి వేమన జయంతి ఉత్సవాలు

కర్నూలు(లీగల్), జనవరి 17: మహాయోగి వేమన జయంతి ఉత్సవాలను ఈనెల 19న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాయంత్రం నిర్వహిస్తున్నటు సమితి ప్రెసిడెంటు, న్యాయవాది ఎస్.రంగా రవికుమార్ తెలిపారు. యోగి వేమన భావ ప్రచార సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా న్యాయవాది ఎస్.రంగారవికుమార్, ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది ఆర్.సత్యనారాయణ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఎం.క్రిష్టారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మురళీధర్, హెచ్.రామలింగప్పలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

షర్మిలకు డీసీసీ అధ్యక్షుడి శుభాకాంక్షలు



మిఠాయిలు తినిపించుకుంటున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 17: కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్ షర్మిలమ్మకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.బాబు రావు బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజును నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, మాణికం ఠాగూర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ సంబరాలు: పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకం పట్ల ఎన్ఎస్‌యూఐ సంబరాలు చేసుకుంది. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్ ఆధ్వర్యంలో బాణ సంచాల పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాం గ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.బాబు రావు మాట్లాడుతూ షర్మిలమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బతుకన్న, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు షేక్ మాలిక్, విజయ్, పాలెం సుజాత, ఎస్.ప్రమీల పాల్గొన్నారు.

వామ్మో కుక్కలు

» దాడిలో గాయపడుతున్న చిన్నారులు



నగరంలో ప్రధాన కూడలిలో కుక్కల సమూహం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 17: నగరంలోని నందికొట్కూరు రోడ్డులోని జయసింహ టవర్ వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉందని రమేష్ అనే వ్యక్తి అక్టోబరు, నవంబరు నెలలో ఫిర్యాదు చేశారు. 95వ సచివాలయ పరిధిలో కూడా కుక్కలతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని సంధ్య అనే మహిళ ఫిర్యాదు చేసారు. పెద్దపాడు గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయని ఓ వ్యక్తి ఏకంగా స్పందనలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని వివిధ వార్డుల నుంచి అక్టోబరు నుంచి ఇప్పటి వరకు కమాండ్ కంట్రోల్‌కు కుక్కలను తీసుకెళ్లాలని 16 ఫిర్యాదులు అందాయి. భాస్కర్‌నగర్, ఖిల్లావీధి, నందికొట్కూరు రోడ్డు జయజింహ టవర్స్, గౌలి గేరి, రోజా వీధి, బాలాజీనగర్, బొంగులబజారు, టౌన్‌మోడల్ పాఠశాల, పెద్దమార్కెట్, 19వ వార్డులో బైపెస్టు కాలనీ, నాలుగో తరగతి కాలనీ, 95 సచివాలయ పరిదిలో సిద్ధార్థనగర్, ఆదిత్యనగర్, హోసన్న మందిర్, నరసిం హారెడ్డి నగర్ తదితర ప్రాంతాల నుంచి కుక్కల బెడదను నిరోధించాలని ఫోన్లు వచ్చాయి.

పట్టుకెళ్లి ఆపరేషన్ చేస్తున్నాం



నగరంలో కుక్కలను పట్టుకెళ్తున్నాం. పట్టుకెళ్లిన కుక్కలను కేవలం ఆపరేషన్ చేసి వదలాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఉంది. అంతేగాని వాటిని చంపే అధికారం చట్టపరిధిలో లేదు. అందుకే విడతల వారీగా అన్ని వార్డుల్లో వాటిని పట్టుకెళ్లి ఆపరేషన్ చేసి వదిలేస్తాం.

- కే.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ

'శ్రీకృష్ణ కమలపాలిక' ప్రదర్శన

కర్నూలు(కల్చరల్) జనవరి 17: గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఆరంభమైన మూడురోజుల ఎన్టీఆర్ వర్ధంతి ఉత్సవాల్లో బుధవారం రాత్రి కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారుల 'శ్రీకృష్ణ కమలపాలిక' పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటక దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఫోన్ ద్వారా మాట్లాడుతూ ఏటా ఎన్టీయార్ వర్ధంతి రోజైన జనవరి 18ని పురస్కరించుకొని గుంటూరు ఎన్టీయార్ కళా పరిషత్తు నాటక ప్రదర్శనలు నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులతో నాటక ప్రదర్శనలు ఇప్పింస్తోందని తెలిపారు. అనంతరం కళాకారులకు ఎన్టీఆర్ కళా పరిషత్తు నిర్వాహకుడు రామకృష్ణ జ్ఞాపికలు అందజేసినట్లు వివరించారు.

జొహరాపురంలో ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 17: సంక్రాంతిని పురస్కరించుకుని సీఐటీ యూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జొహరాపురంలోని మైదా నంలో మూడురోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈకార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువతీ, యువకులు క్రీడల వైపు మొగ్గుచూపితే ఎలాంటి దురలవాట్లు దరి చేరవని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, విజయ్, రమణ, నాగరాజు, తిప్పన్న, టి.కృష్ణ, హుసేన్‌వలి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో దాతల సహకారంతో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. మొదటి విజేతగా హుశేనాపురం జట్టు నిలవగా.. రూ.20వేల నగదును దాత ఆకుల మహేష్, హనుమంతు నగదును అందజేశారు. రెండో విజేతగా సోమ యాజులపల్లె జట్టు నిలిచి రూ.10వేల నగదును దాత సురేష్, మూడో విజేత గా సోమయాజులపల్లె నిలిచి రూ.5వేల నగదును దాత వీరభద్ర నగదును అందజేశారు. నాలుగో విజేతగా సోమయాజులపల్లె నిలిచి రూ.2,016లు నగదు ను దాత ఆకుల వెంకట్రాముడు అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా పరుశ, కే.సురేష్, ఏ.సురేష్ వ్యవహరించారు.


కేతవరంలో మహిళలకు పోటీలు



పోటీలను తిలకిస్తున్న మహిళలు

ఓర్వకల్లు, జనవరి 17: మండలంలోని కేతవరం గ్రామంలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండుగ పురస్కరించుకుని మహి ళలు, పిల్లలు, యువతకు వాలీబాల్, స్లోబైక్, కుండకొట్టే ఆటలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం శాఖ కార్య దర్శి శ్రీధర్ అధ్యక్షత వహించారు. విజేతలకు మహిళా సంఘం జిల్లా నాయకులు ధనలక్ష్మి, శ్యామల, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి, సూర్యనారాయణ, ఓబులమ్మ, లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పాలి



బీకే సింగ్, డాక్టర్ పవన్‌కుమార్ సింగ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జనవరి 17: సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేవి పండుగలేనని, సంక్రాంతి పండుగను ఘనంగా చాటి చెప్పుకోవాలని అగ్రశేణి గ్రూప్స్ అధినేత బీకే సింగ్ అన్నారు. నగర శివారు జోహరాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగిన సంక్రాంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన బీకే సింగ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. కార్యక్రమంలో బీకే సింగ్, ఆయన తనయుడు డాక్టర్ పవన్‌కుమార్ సింగ్‌లను శాలువలు కప్పి, పూలమాలలతో ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెంకటయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు బాలస్వామి, తిరుపతయ్య, లక్ష్మన్న, క్రిస్టఫర్ పాల్గొన్నారు.

బీసీల రథయాత్రను జయప్రదం చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 17: నగరంలో శుక్రవారం జరిగే బీసీల రథ యాత్రను జయప్రదం చేయాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం బీసీ భవన్‌లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, భారతి, విజయ్, మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

అల్లర్లకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఓర్వకల్లు, జనవరి 17: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ విజ యశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని హుశేనాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ రోజు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట ఎస్ఐ రాజారెడ్డి, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏవో సుధాకర్ ఉన్నారు.

కొంగనపాడులో మిరప పంట దగ్ధం

కల్లూరు, జనవరి 17: కల్లూరు మండల పరిధిలోని కొంగనపాడు గ్రామంలో టి.నాగయ్య, టి.శ్రీనివాసులుకు చెందిన మిరప పంట దగ్ధమైంది. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పొలంలో ఆరబోసిన మిరప పంటను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు సమాచారం. గుర్తించిన రైతులు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పే ప్రయ త్నం చేశారు. అప్పటికే మిరప పంట అధిక శాతం కాలి బూడిదనైట్లు రైతులు తెలిపారు. రూ.లక్షల్లో నష్టం జరిగినట్లు రైతులు కన్నీరు మున్నీరై విలపించారు.

22 వరకు 'స్వచ్ఛ దేవాలయ' కార్యక్రమాలు

కర్నూలు(కల్చరల్), జనవరి 17: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాలరా ముని ప్రాణప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22 వరకు 'స్వచ్ఛ దేవాలయ' కార్యక్రమాలు కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగురూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలోని అశోక్‌నగర్‌లోగల మల్లికార్జున భ్రమరాంబాదేవి ఆలయంలో స్వచ్ఛ దేవాలయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆలయం ఆవరణ లోపల, బయట శుభ్రం చేశారు.

అధ్వానంగా గూడూరు-చనుగొండ్ల రహదారి



గూడూరు - చనుగొండ్ల రహదారి దుస్థితి

గూడూరు, జనవరి 17: గూడూరు- చనుగొండ్ల రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. గూడూరు నుంచి వయా చనుగొండ్ల మీదుగా కోడుమూరు వెళ్లాలంటే 11 కి.మీ రహదారి. అయితే దాదాపు ఇరవై ఏళ్ళకు పైగా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో గూడూరు-చనుగొండ్ల రహదారి ఎక్కడికక్కడే రాళ్లు తేలాయి. ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారే తప్ప నిధులు మాత్రం మంజూరు కాకపోవడం గమనార్హం. రహదారి అధ్వానంగా మారడంతో ఆర్టీసీ బస్సులు కూడా తిరగడం లేదు.

వలంటీర్లకు ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్లు

కర్నూలు (న్యూసిటీ), జనవరి 17: నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న 28 వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సెక్షన్ సూపరింటెండెంట్లు అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. నగరంలోని 133 సచివాలయల పరిధిలో 28 పోస్టులు ఖాళీ ఉండగా 82 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వలంటీర్ల ఎంపిక వివరాలు త్వరలోనే తెలుపుతామని కమిషనర్ తెలిపారు. సూపరింటెండెంట్లు స్వర్ణలత, క్రిష్టఫర్, శ్రీదేవి, మన్సూర్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి సభలు: తిక్కారెడ్డి

మంత్రాలయం, జనవరి 17: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సభలు నేడు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోసిగి, నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో తాను పాల్గొంటానని, కోసిగి మండలంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని చెప్పారు. కౌతాళం మండలంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, పెద్దకడుబూరు మండలంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి టీడీపీ జెండాను ఎగురవేయాలని సూచించారు. ఎవరి మండలాల్లో మండల కేంద్రంలోనే ఎన్టీఆర్ వర్ధంతి జరుపుకోవాలని సూచించారు. మండల అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, ఎన్టీఆర్ బాలకృష్ణ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోదీని కలిసిన కునిగిరి నీలకంఠ



మోదీతో కునిగిరి నీలకంఠ

ఆదోని టౌన్, జనవరి 17: సత్యసాయి జిల్లా పాల సముద్రంలో భూమి పూజకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాల సముద్రంలో భూమి పూజ చేసిన రెండేళ్లలోనే నేషనల్ అకాడమీ అఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్స్ అండ్ నార్కోటిక్స్ అకాడమీ భవన నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభించిన ఘనత మోదీకే దక్కుతుందని అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రాభివృద్ధి కోసం రూ.వేల కోట్ల నిధులను అందిచారన్నారు. రాష్ట్రంలో కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచా రం చేసుకొంటుందని విమర్శించారు.

తలనీలాల వేలం నాలుగోసారి వాయిదా

మద్దికెర, జనవరి 17: మండలంలోని పెరవలిలో రంగనాథస్వామి ఆలయ తలనీలాల వేలం పాట బుధవారం నాలుగోసారి వాయిదా పడింది. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖరరెడ్డి, దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడ్ ఆధ్వర్యంలో వేలం పాటలు వేయాలని చూశారు. గత ఏడాది 2023 ఫ్రిబవరి 6 నుంచి 2024 ఫిబ్రవరి 6వ తేదీ వరకు తలనీలాల వేలం పాట రూ.16.10లక్షలకు వేలం ద్వారా దక్కించుకు న్నారు. ఈ ఏడాది వేలం పాటలు గత నెలలో మొదటి సారిగా నిర్వహిం చగా నలుగురు పాటదారులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొని రూ.9.50లక్షలకు వేలం పాట పాడారు. గత ఏడాది కంటే తక్కువ పాటకు ఇవ్వలేమని అధికారులు తెలిపారు. తిరిగి రెండోసారి వేలం నిర్వహించగా రూ.8 లక్షలకు పాట పడారు. మూడో సారి వేలం పాట వేయగా నలుగురు పాటదారులు పాల్గొని రూ.8.50లక్షలకు పాట పాడారు. గత ఏడాది కంటే తక్కువ పోయిందన్న ఉద్దేశంతో జనవరి 17 2024కు వాయిదా వేశారు. అయితే ఈ ధఫా వేలం పాటలో ఒక్క వేలం పాట దారుడు కూడా పాల్గొనకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఆలయ ఈవో చంద్రశే ఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కంటే తక్కువ పోతే ఇవ్వలేమని, ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశామని పేర్కొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



ఆదోనిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 17: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకం కలుగుతోందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠప్ప అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మారుతి రావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

ఆలూరు: ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరడం పార్టీలో నూతన ఉత్తేజం కలిగిందన్నారు.

ప్రయాణికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

ఆదోని టౌన్, జనవరి 17: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సమస్య లను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసీ శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆర్‌సీసీ నాయకులు బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేకమంది ప్రయాణికులు ఆదోని పట్టణం మీదుగా రాకపోకలు సాగించేవారికి రాత్రి సమయంలో బస్టాండ్ ప్రాంగణంలో బస చేయడానికి వసతి కల్పించకపోవడం, తాగునీరు, మహిళలకు శౌచాలయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్ర మంలో జగదీష్, భద్రిస్వామి, షేక్షావలి, శివగౌడ్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుల పేర్లు అగౌరవపరచడం తగదు

పత్తికొండటౌన్, జనవరి 17: ప్రపంచానికే ఆదర్శనీయులు కారల్ మార్క్స్, లెనిన్ అని, గుంటూరు కారం సినిమాలో విలన్‌లకు ఆ మహనీయుల పేర్లు పెట్టడం అగౌరవ పరచడమేనని తక్షణమే ఆ పేర్లను తొలగించాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు అల్తాఫ్, హనుమేష్, పెద్దయ్య, కారుమంచి, నజీర్‌లు డిమాండ్ చేశారు. బుదవారం స్థానిక లక్ష్మి థియేటర్ వద్ద గుంటూరు కారం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ వద్ద ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి త్రివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సోషలిస్టు రాజ్య స్థాపనకై పోరాడిన గొప్ప మహనీయులు కారల్‌మార్క్స్, లెనిన్ పేర్లను విలన్‌లకు పేర్లు పెటడం తగదని తక్షణమే నిర్మాత త్రివిక్రమ్ బహిరంగ క్షమాపణ చెప్పి సినిమాలో ఆ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దకడుబూరు, జనవరి 17: మండలంలోని మేకడోణ గ్రామంలో పాము కాటుకు గురై లక్ష్మి (45) బుధవారం మృతి చెందింది. కురువ నరసన్న భార్య లక్ష్మి గత సోమవారం వేరుశనగ పంటలో కలుపు తీస్తుండగా పాము కరిచింది. కుటుంబసభ్యులు బసలదొడ్డి గ్రామానికి తరలించి నాటు వైద్యం అందించారు. ప్రయోజనం లేకపోవడంతో ఆదోని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి భర్త నరసప్ప, నలుగురు కుమారులు ఉన్నారు.

ఒంటికాలిపై అంగన్‌వాడీల నిరసన

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 17: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె బుధవారంతో 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగ అంగన్‌వాడీ కర్యకర్తలు, ఆయాలు ఒంటికాలిపై నిలబడి తమ నిరసనను వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా డప్పు వాయిస్తూ పాటలు పాడారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు శైలజ, నీరజ, నాగలక్ష్మీ, కృష్ణవేణి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌త తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు తమ పోరాటం ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, తిమ్మగురుడు, రాజు పాల్గొన్నారు.

ఆదోని: తమ డిమాండ్ల సాధన కోసం ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, సరోజ, జానకిలు మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గీత, విమల, పద్మ, సోమక్క, లలిత, ఉమ, లక్ష్మీదేవి, శారద, గీత, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆలూరు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని రైతుసంఘ నాయకులు అంజి, సీఐటీయూ మండల కార్యదర్శి షాకీర్, ఏపీ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ అన్నారు. అంగన్‌వాడీలు చేపడుతున్న దీక్షలు బుధవారం 37 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బెది రింపులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు క్రిష్ణ, వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బారతి, లక్ష్మీ, నరస్వతి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరిలో ఈనెల 19వ తేదీ నుంచి అమరణ నిరాహార దీక్ష చేపడతామని బుధవారం అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఈనెల 19వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షకు అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, విశ్వకుమారి, నాగమణి, ఛాయాదేవి, రైతు సంఘం నాయకులు రంగన్న, రంగప్ప పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మంత్రాలయం: అంగన్‌వాడీ కార్యకర్తలు న్యాయమైన డిమాండ్లు వైసీపీ ప్రభుత్వం చేసే వరకు పోరాటం ఆపేది లేదని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు విశాలాక్షి, భీమేశ్వరి, లావణ్య అన్నారు. బుధవారం మంత్రాలయంలో అంగన్‌వాడీ దీక్షల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుయూ జయరాజు, అంజిరాజు, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కలించాలని అలాగే న్యాయం పరమైన కొర్కెలను వెంటనే తీర్చాలని కోరుతూ బుధవారం నందవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర గంట పాటు అంగన్‌వాడీలు సీఐ టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయ కులు తులసి, అరుణ, భాగ్యమ్మ, గాయత్రి పాల్గొన్నారు.





ఆస్పరిలో అంగన్‌వాడీల నిరసన, నందవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం

టీడీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 17: క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బుధవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పత్తికొండలోని టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమగ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వైసీపీ నాయకుల దాడులు, భూదందాలు నచ్చక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరామని గ్రామనాయకులు తలారి శ్రీరాములు, బోయకమ్మక్క, చిన్న రంగడు, బోయరేమటి మధు, బోయ తలారి సూరిబాబులు తెలిపారు.

కేఈ శ్యాంబాబు విరాళం: పత్తికొండ పట్టణ గ్రామదేవతలు అంకాళమ్మ, బంగారమ్మ దేవాలయం దేవర ఉత్సవాలకు, ఆలయ ఆర్చీ నిర్మాణాలకు రూ.లక్ష విరాళాన్ని టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అందించారు. బుధవారం పట్టణంలోని కొండగేరి, అంకాళమ్మ దాసరిగేరి రైతులు శ్యాంబాబును కలిశారు. ఊరి దేవర ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నామని దేవర నిర్వహణకు, ఆలయ ఆర్చీ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. దీంతో రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. దేవరనిర్వహణ సభ్యులు కర్రి లింగన్న, తిక్రరమేష్, గొల్లభూ షన్న, చాణక్యటైలర్, కప్పె మునిస్వామిలకు రైతుల సమక్షంలో విరాళం నగదును అందించారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమో ద్‌కుమార్‌రెడ్డి, లోక్‌నాథ్‌లు ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఆదోని రూరల్, జనవరి 17: ఆదోని మండలం ధణాపురం గ్రామానికి చెందిన ఓబులేసు, నాగరాజులపై ఇస్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా బుధవారం నాగనాథన హళ్ళి గ్రామ శివారుల్లో అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 4 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

ఎమ్మిగనూరు, జనవరి 17: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి విధులకు హాజరైతే జరిగే పరిణామాల గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సీఐ నాగరాజు, యూనియన్ నాయకులు రఫిక్, మహేశ్వరరెడ్డి, పంపాపతి, సూపరింటెండెంట్ గంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించకపోతే చర్యలు

తుగ్గలి, జనవరి 17: ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సావిత్రి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తాగునీటి, మురికినీరు సమస్యలను ఎప్పకటిప్పుడు గుర్తించాలని, గుర్తించి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శులు అంకాలప్ప, రామాంజినేయులు, కాశీరంగనాథ్, శివ, శివకుమార్ పాల్గొన్నారు.

రాయలసీమను రాళ్లసీమగా మార్చిన సీఎం

భారతీయ జనతా కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామి

ఎమ్మిగనూరు, జనవరి 17: రాయలసీమను రాళ్లసీమగా మార్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని భారతీయ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం భారతీయ కిసాన్‌మోర్చ కర్నూలు జిల్లా కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు బీఎన్ ఈరన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో రైతుల సమస్యలను పరిష్క రించాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డీటీ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. కుమారస్వామి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో కరువు తాండవిస్తోందిని, ఈ జిల్లాల నుంచి అనేక మంది వలసవెళ్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదన్నారు. చివరకు లక్షలాది కుటుంబాలకు తాగునీరు లేని దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ గత ఏడాది కరువు వచ్చి గ్రామాలకు గ్రామాలు వలసలు వెళ్లాయన్నారు. కర్నూలు జిల్లాలోని వేదవతి ప్రాజెక్టు నిర్మాణం జరిగివుంటే గ్రావిటి కింద నీరు తీసుకునే అవకాశం ఉండేదన్నారు. అయితే ఇప్పటి వరకు శంకుస్థాపనలే తప్ప పనులు చేసిందిలేదన్నారు. దీని ఖర్చు కేవలం రూ. 150 కోట్లేనన్నారు. కిసాన్ మోర్చ నాయకులు సురేంద్ర రెడ్డి, చంద్రశేఖర్, భీమనాయుడు, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, రామలింగ, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కోటి యాదవ్, కార్యదిర్శి నరసింహులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కుమార స్వామి

డ్రిప్ పైపులు ధ్వంసం

మిరప మొక్కలను తొలగించిన చేసిన దుండుగులు

కోసిగి, జనవరి 17: కోసిగిలోని 4వ వార్డుకు చెందిన తిప్పలదొడ్డి ఈరన్న అలియాస్ తిక్కోడు, తాయమ్మ దంపతులకు కోసిగిలోని తిమ్మప్ప కొండ సమీపంలో ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో మిరప, వేరుశనగ పంటలు సాగు చేశారు. అయితే.. మంగళవారం రాత్రి రైతు పొలంలోని డ్రిప్ పైపులను ధ్వంసం చేసి మిరప మొక్కలను తొలగించారని రైతులు తిప్పలదొడ్డి ఈరన్న, తాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పొలంలోని తాళం వేసి ఉన్న రేకులకొట్టంలో తాళాలు పగు లకొట్టి రెండు గొర్రెలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఒక గొర్రె ను కోసిగిలోని ఆదోని రోడ్డులో ఉన్న మార్కెట్‌యార్డులో నేరేడు చెట్టుకు గొర్రెను ఉరివేసి చంపేశారు. రూ.2లక్షల మేర ఆస్తినష్టం కలిగిందని రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టంపై కోసిగి ఎస్ఐ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.



ధ్వంసం చేసిన డ్రిప్ పైపులను చూపుతున్న మహిళా రైతు

'ప్రతి నెల సమావేశం నిర్వహించాలి'

గోనెగండ్ల, జనవరి 17: గ్రామాభివృద్ధిలో బాగంగా ప్రతి నెల గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్ వార్డు సభ్యులు తప్పనిసరిగా సమావేశం నిర్వహించుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్డీ నగేష్ సూచించారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బుధవారం రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఎంపీడీవో సమావేశం భవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సతీష్, తాటికొండ వెంకటేశ్వర్లు, బైలుప్పల వెంకటేశ్వర్లు పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండటౌన్, జనవరి 17: సీపీఐ కాలనీలు వీకెనగర్, పార్వతికొండ, దిద్దుసేను కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజాసాహెబ్, రామాంజినేయులు, దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు గురుదాసు, రైతు సంఘం నాయకులు కారన్న, వీరన్న అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సరితకు సీపీఐ బృందం వినతిపత్రం ఇచ్చారు. 15ఏళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించామని, దిద్దుసేన కొట్టాల, పార్వతికొండ కాలనీల్లో వందలాది మంది నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కోసం ఏళ్లతరబడి పోరాటాలు చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, శంకర్, నాగేంద్ర, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా

జడ్పీ మాజీ చైర్మన్ బత్తిని వెంకట్రాముడు

పత్తికొండ, జనవరి 17: అవకాశం ఇస్తే టీడీపీ తరపున కర్నూలు ఎంపీగా పోటీచేస్తానని జడ్పీ మాజీ చైర్మన్ బత్తిని వెంకట్రాముడు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాల యంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతున్నానని చెప్పారు. ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని అధినేత చంద్రబాబును కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, వెంకటపతి, శివరాముడు, వెంకటేశ్వర్లు, సోమ్లానాయక్, బీటీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

మద్దికెర, జనవరి 17: వైసీపీ ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని జీవో 512ను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కోదండ రాముడు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ నిబంధనల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన నీత్‌ఆయోగ్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని తేవడం దుర్మార్గమన్నారు.

సత్వరమే పంటనష్ట పరిహారం ఇవ్వాలి

దేవనకొండ, జనవరి 17: ఖరీఫ్ సీజన్ రైతులని నిండా ముంచిందని, పంటనష్టపరిహారం పంపిణీ జాప్యం చేయకుండా సత్వరమే పంపిణీ చేసి రైతులని ఆదుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సిద్ధం హంపిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఓ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్షాలు లేక రబీ పంట సాగు చేసిన రైతులు నష్టపోయారని, ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రకటించాలని కోరారు. సలహామండలి సభ్యుడు మల్లికార్జున, ఏఈఓ రంగన్న పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

ఎమ్మిగనూరు, జనవరి 17: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని బస్టాండ్ సర్కిల్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ అధ్యక్షులు పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హర్ష, అనిల్, గంగాధర్, శివ పాల్గొన్నారు.

28న సంగీత కచేరి

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 17: ఎమ్మిగనూరు పట్టణంలో ఈనెల 28న నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు పూజారి లక్ష్మన్న, బతకన్న, నాగన్న తెలిపారు. వారు మాటా డుతూ త్యాగరాజు స్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను పట్టణంలోని అజంతా ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగీత కచేరి కరపత్రాలను విడుదల చేశారు.

పోటాపోటీగా రాతిదూలం పోటీలు



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచు

తుగ్గలి, జనవరి 17: మౌలాలిస్వామి ఉరుసును పురస్కరించుకుని నిర్వహించిన రాతి దూలం పోటీలు పోటాపోటీగా జరిగాయి. బుధవారం మండలంలోని ఉప్పర్లపల్లిలో రాతిదూలం పోటీలను సర్పంచు ప్రభాకరరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా ప్రభాకర్‌రెడ్డి రూ.20వేలు, రూ.15 వేలు దాత చిప్పగిరి కృష్ణ, రూ.10వేలు దాత షేక్ పీరా , రూ.5వేలు మాను కింద హనుమన్నలతో పాటు రూ.3వేలు కూడా అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం రైతులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు రామాంజినేయులు, భీమానాయక్, రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే .. మహాభాగ్యం

మద్దికెర, జనవరి 17: మద్దికెర గ్రామంలోని ఎస్సీ కాలనీ శివారులలో అపద్బాందవ సేవా సమితి బేతేల్ క్రిస్టియన్ నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం కిమ్స్‌సవేరా వారి ఆధ్వర్యంలో ఉచిత గుండెవైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 150మంది చికిత్సలు చేయించుకోగా 50మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జమేదార్ నీలకంఠరాయుడు, మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ గుండె జబ్బుపై చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుండె వైద్యశిబిరానికి సంబంధించి ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆపద్బాందవ సేవాసంస్థ అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, రాజశేఖర్, ‌కాంత్, బేతేల్ చర్చి నిర్వాహకుడు ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీగా పంచాయతీ కార్యదర్శి గోపాల్

తుగ్గలి, జనవరి 17: తుగ్గలి ఈవోఆర్డీగా పనిచేస్తున్న తిరుపాలు యాదవ్ బదిలీపై వెళ్లడంతో పగిడిరాయి పంచాయతీ కార్యదర్శి గోపాల్‌ను ఇన్‌చార్జి ఈవోఆర్డీగా బాధ్యతలు నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్ తుగ్గలి ఇన్‌చార్జి ఈవోఆర్డీగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఈవోఆర్డీగా అదనపు బాధ్యతలు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పంచాయతీ కార్యదర్శి పనిచేయాలని ఆదేశించారు.

పంట నమోదుకు గడువు పొడిగింపు

మద్దికెర, జనవరి 17: మండలంలో రబీ పంటలు నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 15వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఏవో రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు సమీపా రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు ఈకెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతులు పండించిన కంది దిగుబడులను ప్రభుత్వం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఈవోలు జాకీర్ హుసేన్, ఆనంద్‌లు ఉన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర, జనవరి 17: వర్షాభావంతో నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనితయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ గ్రామ అభివృద్ధిపై శిక్షణ తరగతులు జరిగాయి. ఎంపీడీవో నరసింహమూర్తి, సర్పంచ్‌లు సుహాసిని, విజేయుడు పాల్గొన్నారు.